జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 51 ॥ శనివారం ॥ 18-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

18 జూలై 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:54 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి పంచమి తె. 3:44౦ వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) సా. 6:02 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం వారియ రా. 8:44 వరకు కరణం బవ సా. 4:13 వరకు భాలవ తె. 3:44౦ వరకు వర్జ్యం రా. 1:15 నుండి రా. 2:52 వరకు దుర్ముహూర్తం ఉ. 7:38 నుండి ఉ. 8:29 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:45 వరకు యమగండం మ. 1:59 నుండి మ. 3:36 వరకు గుళికాకాలం తె. 5:54 నుండి ఉ. 7:31 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:18 నుండి తె. 5:06 వరకు అమృత ఘడియలు ఉ. 11:44 నుండి మ. 1:18 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: “౦” అనగా మరుసటి రోజున



# ధరణి అక్రమాలపై సిట్!

## వర్షాభావ పరిస్థితులపై కేంద్రానికి నివేదిక

## పంచాయతీ ఖాతాల్లోనే గ్రామాల ఆదాయం

## తెలంగాణ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో దాదాపు 3 గంటల పాటు జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపేందుకు వివిధ శాఖల అధికారులు, నిపుణులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కేబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించింది.

హైదరాబాద్, జూలై 17: ధరణితో తలెత్తిన ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రులు, ఈ పోర్టల్ టెండర్ ప్రక్రియ నుంచి భూభారతి ఏర్పాటు వరకు క్షుణ్ణంగా విచారణ జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు కేబినెట్ సమావేశం వివరాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు , అడ్లూరి లక్ష్మణ్ వివరించారు. 2020 అక్టోబర్ 29 నుంచి తరువాయి 2 వ పేజీలో..



# 75 రైల్వే స్టేషన్ల ప్రారంభం

## దేశానికి అంకితం చేసిన ప్రధాని మోదీ

## ఏపీకి మూడు నూతన రూపుదిద్దుకున్న స్టేషన్లు

న్యూఢిల్లీ/మంగళగిరి: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 75 రైల్వే స్టేషన్లను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. పంజాబ్‌లోని జలం ధర్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని అక్కడి నుంచి ఈ స్టేషన్లను జాతికి అంకితం తరువాయి 2 వ పేజీలో..



## కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం

# కట్టుబడి ఉంది

### కులవృత్తుల మేళా ప్రారంభం

### చేతివృత్తులకు మార్కెట్ అవకాశాల కల్పన

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూలై 16 :
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కులవృత్తుల మేళాను ప్రారం భించారు. సంప్రదాయ కులవృత్తులను ప్రోత్సహించడంతో పాటు వాటికి మార్కెట్ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కులవృత్తుల మేళాలో వివిధ కులాలకు చెందిన చేతివృత్తిదారులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మొత్తం 60 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ మేళా 15 రోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి (మిగతా 2వ పేజీలో)



# సీతారామ పనులకు వేగం

### భూసేకరణకు రూ.135 కోట్లు విడుదల

### ప్రతి ఎకరాకు గోదావరి జలాలే లక్ష్యం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, జూలై 16 :
ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటలో నిర్మాణంలో ఉన్న సీతారామ ఎత్తి పోతల పథకం ట్రంక్ టన్నెల్ పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం క్షేత్రస్థా యిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పనుల పురోగతి, భూ సేకరణ, నిధుల విడు దల, నిర్మాణ వేగం, పెండింగ్ అం శాలపై చర్చి ంచారు.
(మిగతా 2వ పేజీలో)



## జగన్నాథ రథయాత్రకు మంత్రి శ్రీకారం

### రథాన్ని లాగిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, జూలై 16 :
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం కూక ట్‌పల్లిలో ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర--2026ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వ హించి జగన్నాథ స్వామివారి ఆశీస్సులు పొందారు. రథ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం భక్తులతో కలిసి జగన్నాథ స్వామి వారి రథాన్ని లాగుతూ రథయాత్రలో పాల్గొన్నారు.
(మిగతా 2వ పేజీలో)



## భారత్-యూకే ఒప్పందంతో తెలంగాణకు కొత్త అవకాశాలు

### యూకే ప్రతినిధులతో మంత్రి భేటీ

### పెట్టుబడులు, ఎగుమతుల పెంపుపై చర్చ

హైదరాబాద్, జూలై 16 :
భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమ ల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ద్వారా తెలంగాణకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి గురువారం సచివాలయంలో యూకే డిప్యూటీ ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా)
(మిగతా 2వ పేజీలో)



## అంగన్‌వాడీలకు విద్యుత్ వెలుగులు

### 90 శాతం కేంద్రాలకు సదుపాయం

### మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, జూలై 16 :
రాష్ట్రంలోని అంగన్‌వాడీ మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అంగన్ వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం :** శుభఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రారంభించిన పనులు సాఫీగా పూర్తవుతాయి. మీ నిర్ణయాలు విజయానికి దారి తీస్తాయి. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. గురు ధ్యానం శుభప్రదం.

**వృషభం :** అనుకూలమైన రోజు. పనుల్లో ఆశించిన పురోగతి ఉంటుంది. దైవబలం మీకు తోడ్పడుతుంది. అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తవుతాయి. శ్రీలక్ష్మీదేవిని దర్శించుకోవడం శ్రేయస్కరం.

**మిథునం :** చక్కని ఫలితాలు పొందుతారు. ప్రారంభించిన పనులు విజయవంతం అవుతాయి. తోటివారి ప్రోత్సాహం లభిస్తుంది. గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. సూర్య నమస్కారాలు చేయండి.

**కర్కాటకం :** పట్టుదలతో ముందుకు సాగితే మంచి ఫలితాలు పొందుతారు. ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేయండి. దగ్గర వారి సహకారం లభిస్తుంది. దైవనామస్మరణ మనోబలాన్ని పెంచుతుంది.

**సింహం :** ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయి. కుటుంబ విషయాల్లో సహనంతో వ్యవహరిస్తే మేలు జరుగుతుంది. నవగ్రహ ధ్యానం శుభప్రదం.

**కన్య :** అనుకూల ఫలితాలు కనిపిస్తుస్తున్నాయి. పనుల్లో పురోగతి ఉంటుంది. ఒక శుభవార్త ఆనందాన్ని కలిగిస్తుంది. ఖర్చుల్లో కాస్త నియంత్రణ పాటించండి. శ్రీఆంజనేయస్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**తుల :** శుభప్రదమైన రోజు. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రశంసలు పొందుతారు. మానసిక ధైర్యం పెరుగుతుంది. శ్రీసుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించండి.

**వృశ్చికం :** సహనంతో వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. బంధువులతో సౌమ్యంగా మాట్లాడండి. పనుల్లో వచ్చిన సవాళ్లను విజయవంతంగా అధిగమిస్తారు. ఖర్చులను నియంత్రించండి. నవగ్రహ శ్లోకాలు చదవండి.

**ధనుస్సు :** విజయం మీకు అనుకూలంగా ఉంది. ప్రారంభించిన పనులు ఆశించిన విధంగా పూర్తవుతాయి. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. విష్ణు సహస్రనామం పారాయణం శుభప్రదం.

**మకరం :** శుభఫలితాలు లభిస్తాయి.పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయి. ఆర్థికంగా లాభం ఉ ంటుంది. ఆనందకరమైన వాతావరణం నెలకొంటుంది. ఖర్చుల్లో జాగ్రత్త పాటించండి. శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించండి.

**కుంభం :** అభివృద్ధికి అనుకూలమైన రోజు. ఉద్యోగ, వ్యాపారాల్లో మంచి పురోగతి ఉంటుంది. శు భవార్తలు మీ ఉత్సాహాన్ని పెంచుతాయి.పెద్దల సలహా మీ విజయానికి దోహదపడుతుంది. శ్రీలక్ష్మీ అష్టోత్తరం చదవండి.

**మీనం :** పట్టుదలతో పని చేస్తే విజయాలు మీవే. తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండి ఆలోచించి అడుగులు వేయండి. కుటుంబ సభ్యుల సలహా మేలు చేస్తుంది. నవగ్రహ ధ్యానం శుభఫలితాలను అందిస్తుంది.



# ధరణి అక్రమాలపై సిట్!

మొదటి పేజీ తరువాయి

ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి నేటి వరకు జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులను సిట్ విచారించనుంది. వ్యవసాయ, అసైన్డ్, ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించనుంది. అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. టెండర్ ప్రక్రియ కోసం ప్రత్యేక చట్టం, విధివిధానాల రూపకల్పనకు నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులపై మంత్రిమండలి ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎక్కడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని, కేవలం 30 నుంచి 35 శాతానికి మించి వర్షాలు పడలేదని అభిప్రాయపడింది. నష్టాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక బృందాన్ని పంపాలని, ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించింది. ప్రజల ఫిర్యాదుల కోసం ప్రజాభవన్ లో 1-800-123-7157 టోల్ ఫ్రీ నెంబర్ తో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసేలా హెల్ప్ లైన్ ఏర్పాటు చేసింది.

తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను క్యాబినెట్ ఆదేశించింది. ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యతగా వాడాలని నిర్ణయించింది. ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతాంగానికి అవగాహన కల్పించాలని, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో ప్రత్యేక నివేదిక రూపొందించాలని సూచించింది. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. జూలై 20న ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రులు, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సమగ్ర నివేదికలు తయారు చేయాలని తీర్మానించింది. ఆ నివేదికల ఆధారంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు.

గ్రామ పంచాయతీల నిధుల నిర్వహణకు సంబంధించి క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల సొంత ఆదాయం ట్రెజరీలో కాకుండా నేరుగా జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లోని జీపీ ఖాతాల్లోనే జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 70(3) సవరణకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు త్వరలో ఆర్డినెన్స్ జారీ కానుంది. అలాగే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు,



కార్పొరేషన్లలో ట్రాన్స్ జెండర్లను కో-ఆప్టెడ్ సభ్యులుగా నియమించేందుకు తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019 సవరణకు పచ్చజెండా ఊపింది.సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. గత ప్రభుత్వం విస్మరించిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు మిగిలిన పనులకు డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించింది. జగిత్యాల జిల్లా డిగ్రీ కళాశాలలో పోస్టుల భర్తీకి, సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరులో ఇందిరమ్మ ఇళ్ల కోసం భూమి కేటాయింపునకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బుల్లెట్ ట్రైన్ అలైన్ మెంట్ మార్పునకు ఆమోదం తెలిపింది.

# అంగన్‌వాడీలకు విద్యుత్ వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ఆరు నెలల్లోనే 9,800 కేంద్రాలకు కొత్తగా విద్యుత్ కనెక్షన్లు అందించి చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 35,781 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 32,109 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని మంత్రి తెలిపారు. దాదాపు 90 శాతం కేంద్రా లు ఇప్పటికే విద్యుదీకరణ పూర్తిచేసుకున్నాయని, మిగిలిన కేంద్రాలకు కూడా త్వరలోనే విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. ఇందుకోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. గతంలో దాదాపు 40 శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ లేకపోవడంతో చిన్నారులు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి గుర్తుచేశారు. లైట్లు, ఫ్యాన్లు లేక చీకటి గదుల్లో పిల్లలను ఉంచాల్సి వచ్చేదని, వేసవిలో ఉక్కపోత కారణంగా కేంద్రాల నిర్వహణ కష్టంగా మారేదని పేర్కొన్నారు. విద్యుత్ లేకపోవడం వల్ల డిజిటల్ బోధన అమలు కూడా సాధ్యపడలేదని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ప్రభుత్వ విద్యా సంస్థల తరహాలో ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో విద్యుదీకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని చెప్పారు.

# భారత్--యూకే ఒప్పందంతో తెలంగాణకు కొత్త అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రు కె. అయ్యర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ భారత్--యూకే వాణిజ్య ఒప్పందంతో దేశం నుంచి యూకేకు ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలు తొలగించబడటంతో ఎగుమతులకు విస్తృత అవకాశాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా పెరుగుతుందని, సుమారు 25 బిలియన్ పౌండ్ల (రూ.32.56 లక్షల కోట్ల) వాణిజ్య అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో పారిశ్రామిక తయారీ, జీవ విజ్ఞాన శాస్త్రాలు, విమానయాన రంగం, రక్షణ ఉత్పత్తులు, సమాచార సాంకేతిక రంగం, సెమీకండక్టర్లు, చిప్ రూపకల్పన, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉ న్నాయని మంత్రి వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, యూకే పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి యూకేకు రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయని, కొత్త వాణిజ్య ఒప్పందంతో ఈ సంఖ్యను మరింతగా పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. దేశంలో తయారయ్యే ఔషధ ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో రాష్ట్రం 30 శాతం వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. విమానయాన రంగానికి అవసరమైన అత్యాధునిక విడిభాగాల తయారీలో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచిందని శ్రీధర్ బాబు చెప్పారు. ఎయిర్‌బస్, బోయింగ్, రోల్స్‌రాయిస్, ప్రాట్ అండ్ విట్నీ, డసో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల విమాన విడిభాగాల తయారీ, మరమ్మతు కేంద్రాలు రాష్ట్రంలో ఉండటం తెలంగాణ పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమని వివరించారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భారత్--యూకే వాణిజ్య ఒప్పందం ద్వారా తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక రంగాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని, ఈ అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుక ునేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. సమావేశంలో యూకే ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉ న్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశానికి తొలి హైడ్రోజన్ రైలు

(మొదటి పేజీ తరువాయి)

ఆధునిక రైల్వే రంగంలో భారత్ సామర్థ్యానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతతో ఈ రైలు పూర్తిగా పనిచేస్తుంది. బొగ్గు, డీజిల్ వంటి సంప్రదాయ ఇంధనాల అవసరం లేకుండా హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మార్చి ఇంజిన్‌కు శక్తిని అందిస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే విడుదల అవుతుంది. అందువల్ల కార్బన్ ఉ ద్గారాలు పూర్తిగా శూన్యంగా ఉండటంతో పర్యావరణానికి ఎలాం టి హాని కలగదు. భవిష్యత్తులో హరిత రవాణా వ్యవస్థకు ఈ సాంకేతికత కీలకంగా మారనుందని రైల్వే అధికారులు తెలిపారు. 'నమో గ్రీన్ రైలు' పేరుతో ప్రారంభమైన ఈ రైలుకు 10 బోగీలు, 3200 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన ఇంజిన్ అమర్చారు. గంటకు సుమారు 110 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలులో ఒకేసారి దాదాపు 2,600 మంది ప్రయాణికులు ప్రయాణి ంచే వీలుంది. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉ ంచుకుని ఆధునిక సదుపాయాలతో ఈ రైలును రూపొందించారు. దేశీయ సాంకేతిక నైపుణ్యంతో నిర్మించడం భారత ఇంజినీరింగ్ ప్రతిభను ప్రపంచానికి చాటే ఘట్టంగా నిలిచింది. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేశారు.

హైడ్రోజన్ నిల్వ వ్యవస్థ, ఇంధన కణాల సాంకేతికత, విద్యుత్ నియంత్రణ వ్యవస్థలను భారత ఇంజినీర్లు విజయవంతంగా సమన్వయం చేశారు. ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రైల్వే వ్యవస్థను పర్యావరణ హితంగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలిచింది. ప్రపంచంలో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను తొలిసారిగా జర్మనీ ప్రవేశపెట్టింది. అనంతరం జపాన్, చైనా, అమెరికా తదితర దేశాలు కూడా ఈ సాంకేతికతను వినియోగం లోకి తీసుకొచ్చాయి.

# జగన్నాథ రథయాత్రకు మంత్రి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

వేలాది మంది భక్తులు "జై జగన్నాథ్", "హరే రామ", "హరే కృష్ణ" నామస్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగి పోయారు. రథయాత్ర మార్గమంతా ఆధ్యాత్మిక వాతావ రణం నెలకొంది. భజనలు, సంకీర్తనలు, హరినామ స్మర ణలతో కూకట్‌పల్లి ప్రాంతం మార్మోగింది. భక్తుల ఉత్సాహం మధ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయ ంగా స్వామివారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసి ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమా జంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొంది ంచడంలో ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని జగన్నాథ స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతి నిధులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది పాల్గొని జగన్నాథ రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# సీతారామ పనులకు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు శాశ్వత సాగునీరు అందించడం, గోదావరి జలాలను చివరి ఆయకట్టుకు చేరవేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేసి రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త ఊపు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భూసే కరణ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రూ.135 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి రైతులకు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఆలస్యం లేకుండా పూర్తి చేసి నిర్మా ణ పనులకు ఆటంకాలు లేకుండా చూడాలని సూచిం చారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలకు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సీతారామతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతులకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని నాయకులు తెలిపా రు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కులవృత్తుల అభివృద్ధికి..

(మొదటి పేజీ తరువాయి)

కళాకారులను ప్రోత్సహించా లని కోరారు. బోనాల ఉత్సవాల సందర్భంగా పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి కుండలు, మట్టి దీపాలను వినియోగించేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సంప్రదాయ వృత్తులను కాపాడుతూ కళాకా రుల జీవనోపాధిని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేళాలోని అన్ని స్టాళ్లను సందర్శి ంచిన మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కులవృత్తుల కళాకారులతో మాట్లాడి వారి ఉత్పత్తులను పరిశీలించారు. పూసర్ల వర్గానికి చెందిన కళాకారులు అందిం చిన గాజుల బుట్టను స్వీకరించి, వారి స్టాల్‌లో పూసల దండలను కొను గోలు చేసి ఎమ్మెల్యేల సతీమణులకు బహుమతిగా అం దజేశారు. కులవృత్తులు తెలంగాణ సంస్కృతిలో విడదీ యరాని భాగమని, వాటిని ఆధునిక మార్కెట్‌తో అనుసం ధానం చేసి కళాకారుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

# శ్వేత సంపాదకీయం

**శనివారం 18-7-2026**

# హాట్‌హాట్‌గా సాగనున్న పార్లమెంట్!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు.

పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మొత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.



## కేంద్రమంత్రి, సీఎం ముందు ఎంపీ లావు 3 కీలక విజ్ఞప్తులు

నరసరావుపేట, జూలై 17: మెగా క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ పల్నాడు చరిత్రలోనే ఒక సువర్ణాధ్యాయంగా నిలిచింది. ఈ వేదికపై లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేసిన అనంతరం పల్నాడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. పల్నాడు ప్రాంత వెనుకబాటుతనాన్ని పోగొట్టేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బ్యాంకులు ధనవంతులకే పరిమితమనే అపోహను తొలగిస్తూ, గత 9 నెలలుగా బ్యాంకర్లే స్వయంగా గ్రామాలకు వెళ్లి దరఖాస్తులు సేకరించడం వల్లే నేడు రుణాలు పొందిన లక్ష మందిలో 70 శాతం మంది తొలిసారి లబ్ధి పొందుతున్న వారని ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. గతంలో తాను చేసిన విజ్ఞప్తిని మన్నించి ఆరుగురు ప్రధాన బ్యాంకుల ఎండీలను పల్నాడుకు రప్పించిన నిర్మలమ్మకు, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి మేళాలు మరో ఆరు చోట్ల ఏర్పాటు చేయాలని ఆదేశించిన సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇదే వేదికపై పల్నాడు ప్రాంత ప్రగతి, మహిళా సాధికారితను కాంక్షిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి ముందు ఎంపీ లావు మూడు కీలక ప్రతిపాదనలు ఉంచారు. వ్యవసాయ సహకార సంఘాలలో రైతులు దాచుకునే డిపాజిట్లకు మరింత భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'డిపాజిటర్స్ గ్యారెంటీ ఫండ్' ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే బ్యాంకుల్లో నిల్వ ఉన్న డ్వాక్రా మహిళల పొదుపు డిపాజిట్లపై బ్యాంకులు వడ్డీ చెల్లించేలా కేంద్ర మం త్రి పరిశీలించాలని అభ్యర్థించారు. వీటితో పాటు పల్నాడు పరిధి లోని 25 మండలాల్లో డ్వాక్రా మహిళల భాగస్వామ్యంతో ఒక్కోటి 3 మెగా వాట్ల చొప్పున మొత్తం 25 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పా టు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా డ్వాక్రా మహిళలు ఆర్థికంగా మరింత స్థిరత్వం సాధిస్తారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆశాభావం వ్యక్తం చేశారు.



## నరసరావుపేట రుణమేళా పల్నాడు చరిత్రలో మైలురాయి

**ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కృతజ్ఞతలు**

నర్సరావుపేట, జూలై 17: భారతదేశంలోనే తొలిసారిగా రికార్డు స్థాయిలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ. 3,216 కోట్ల రుణాలను పంపిణీ చేసే భారీ క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమానికి నరసరావుపేట వేదిక కావడం పల్నాడు జిల్లా ప్రజలందరికీ గర్వకారణమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయం పల్నాడు జిల్లా ఆర్థికాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మద్దతుతోనే ఈ మహత్తర కార్యక్రమం సాధ్యమైందని కొనియాడారు. ఈ మెగా రుణమేళా ద్వారా చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, చేనేత కార్మికులు, స్వయం ఉపాధి రంగంలోని యువత, మహిళా సంఘాలు, చిరు వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు గొప్ప అవకాశం లభించిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని పల్నాడుకు తీసుకురావడంలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకోగా, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ విశేష కృషి చేశారని ఎమ్మెల్యే చదలవాడ కొనియాడారు. దాదాపు 20 రోజుల పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి పలు బ్యాంకుల ప్రతినిధులు సమన్వయంతో రాత్రింబవళ్లు శ్రమించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పల్నాడు జిల్లాకు తొలిసారి విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం తమకు దక్కిన గౌరవమని చెప్పారు. ప్రజల ఆర్థిక పురోగతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలకు, లబ్ధిదారులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు మరియు బ్యాంకర్లకు ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.


## కెనడా, ఆస్ట్రేలియా లేదా జర్మనీలో స్థిరపడాలని అనుకుంటున్నారా?

ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు... అధిక ఆదాయం... మీ కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు -- మీ కలలను నిజం చేసుకునే సమయం ఇదే!

నేటి ప్రపంచంలో మెరుగైన జీవన ప్రమాణాలు, అధిక వేతనంతో కూడిన ఉద్యోగాలు, పిల్లలకు నాణ్యమైన విద్య, ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలు మరియు కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు కోరుకునే ప్రతి ఒక్కరికీ కెనడా, ఆస్ట్రేలియా మరియు జర్మనీ ప్రముఖ గమ్యస్థానాలుగా నిలుస్తున్నాయి.

**Exxeella Immigration Services** ద్వారా **Canada PR, Australia PR, Germany Opportunity Card / Job Seeker Visa** వంటి అవకాశాలపై నిపుణుల మార్గదర్శకత్వం పొందండి. మీ విద్య, వయస్సు, పని అనుభవం, భాషా నైపుణ్యాలు మరియు ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ నిబంధనల ఆధారంగా మీ అర్హతను సమగ్రంగా పరిశీలించి, మీకు సరిపోయే ఉత్తమ ఇమ్మిగ్రేషన్ మార్గాన్ని సూచిస్తాము.

మా అనుభవజ్ఞులైన ఇమ్మిగ్రేషన్ నిపుణులు ప్రతి దశలో పూర్తి డాక్యుమెంటేషన్ సహాయం, పారదర్శకమైన ప్రాసెస్ మరియు వ్యక్తిగత ప్రొఫైల్ ఆధారిత సలహాలతో మీ ప్రయాణాన్ని సులభతరం చేస్తారు.

**కెనడా & ఆస్ట్రేలియా PR ద్వారా మీరు పొందగల ప్రయోజనాలు:**

- అధిక జీతాలతో ఉద్యోగ అవకాశాలు
- శాశ్వత నివాసం (Permanent Residency)
- కుటుంబంతో కలిసి స్థిరపడే అవకాశం
- ప్రపంచ స్థాయి విద్య డ ఆరోగ్య సేవలు
- మెరుగైన జీవన ప్రమాణాలు మరియు భద్రమైన భవిష్యత్తు,

జర్మనీ **Opportunity Card** ద్వారా:

- యూరప్‌లో ఉద్యోగ అన్వేషణకు అవకాశం
- అంతర్జాతీయ కెరీర్ నిర్మించుకునే మార్గం
- ప్రపంచ స్థాయి పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు

మీ విదేశీ భవిష్యత్తును విజయవంతంగా నిర్మించుకోవడానికి సరైన ప్రణాళిక, సరైన మార్గదర్శకత్వం మరియు విశ్వసనీయ నిపుణుల సహాయం ఎంతో అవసరం.

**ఈరోజే మొదటి అడుగు వేయండి... రేపటి విజయవంతమైన జీవితానికి నాంది పలకండి!**



**...సంప్రదించండి....**

MD. JAHANGIR
Immigration Adviser
Exxeella Immigration Services
89779 44266
jahangirmd@exxeella.com

# వర్షాభావంలో కూలీలకు పూర్తి ఉపాధి కల్పించాలి

**వీబీజీ రాంజీ పథకం అమలు వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**



సూర్యాపేట, జూలై 17

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా విస్తృతంగా పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం, గ్రామీణాభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కరువు పరిస్థితుల్లో గ్రామీణ కూలీలు వలస వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యం వీబీజీ రాంజీ పథకం కింద భూగర్భ జలాల పెంపునకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మ్యాజిక్ సోక్ పిట్స్, పర్క్యులేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్స్, ఓపెన్ వెల్స్, మ్యాజిక్ డ్రైన్స్ వంటి నీటి రీఛార్జ్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ పనులు పూర్తి చేయాలి జిల్లాలో నిర్మాణంలో ఉన్న నాలుగు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొత్త గ్రామపంచాయతీల్లో మంజూరైన సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈకి సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మరుగుదొడ్లు, సీఎస్‌సీ భవనాల పనులు పూర్తి చేయాలి స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఇందిరమ్మ, నాన్ ఇందిరమ్మ ఇళ్లకు మరుగుదొడ్లు మంజూరు చేసి, ఫొటోలు అప్‌లోడ్ చేసిన వెంటనే నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అలాగే రూ.1.25 లక్షల అంచనాతో వీఓ, స్వయం సహాయక సంఘాల భవనాల వద్ద సీఎస్‌సీ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. పాడి, ఉద్యాన పంటలకు ప్రోత్సాహం సంప్రదాయ పంటలకు బదులుగా కూరగాయల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేలా అవగాహన కల్పించాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. పందిళ్ల సాగులో సొరకాయ, బీరకాయ, దోసకాయ, బెండకాయ వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. సెర్ప్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామ సంఘానికి ఒక ఫిష్ పాండ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నూతనకల్, గరిడేపల్లి మండలాల్లో విజయ డెయిరీ సహకారంతో మిల్క్ చిల్లింగ్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా గ్రామపంచాయతీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎంపీఓలను ఆదేశించారు. జూలై నెలకు సంబంధించిన అన్ని శాఖల పురోగతి నివేదికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ యాదగిరి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సెర్ప్, ఉపాధి హామీ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు

సూర్యాపేట, జూలై 17

సెర్ప్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్–ఎస్ఆర్‌డీఎస్) సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యల్లో భాగంగా శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి. దివ్య ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఈ కార్యక్రమం చేపట్టారు. శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రక్తపోటు, షుగర్, ఈసీజీ, సీబీపీ, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, క్యాల్షియం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వారికి నేత్ర పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఎరికాన్ టీపీఏ హెల్త్ ఇన్సూరెన్స్ అనుసంధానంతో యశోద హాస్పిటల్స్, మ్యాక్స్ విజన్, పాత్‌కైండ్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు సేవలందించారు. మొత్తం 229 మంది సిబ్బంది ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్, వైద్యులు డాక్టర్ శ్వేత, డాక్టర్ సందీప్, డాక్టర్ తరిషక్, డాక్టర్ ఉమాదేవి, మెడికల్ సిబ్బంది సంతు దుర్గతో పాటు డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా, మండల సమాఖ్య ప్రతినిధులు, సెర్ప్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# 10 వేల మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ: పటేల్ రమేష్ రెడ్డి



సూర్యాపేట: జూలై 19

మున్సిపాలిటీ పరిధిలో 10 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందించి స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో వార్డుల వారీగా కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట మండలం బాలెంల గ్రామంలో మదర్ ఇండియా సేవా సంస్థ ఆధ్వర్యంలో 150 మంది మహిళలకు నిర్వహించిన కుట్టు శిక్షణ పూర్తయిన సందర్భంగా సర్టిఫికెట్ల ముద్రణ కోసం తన సొంత నిధుల నుంచి రూ.90 వేల చెక్కును సంస్థ నిర్వాహకురాలు బొజ్జ సంధ్యారెడ్డికి అందజేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో 108 మంది మహిళలకు కుట్టు శిక్షణ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండు దశాబ్దాలుగా స్ప్రెడ్ ఇండియా సంస్థ ద్వారా సూర్యాపేట నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పలు గ్రామాల్లో తాగునీటి ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, బెంచీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకారం అంది స్తున్నామని చెప్పారు. మహి ళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ సూర్యాేపట మున్సిపాలిటీ పరిధిలో ని అన్ని వార్డుల్లో కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి 10 వేల మంది మహిళలకు ఉచిత శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి కరుణాకర్, నామ అరుణ, బైరబోయిన శ్రీనివాస్, పిల్లల రమేష్ నాయుడు, పాలగాని కృష్ణ, కోడి శిరీష, బాలెంల సర్పంచ్ మమత నగేష్, కాంగ్రెస్ నాయకులు వల్దాసు దేవేందర్, ధర్మా నాయక్, తండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# విశ్వకర్మ లబ్ధిదారులకు మార్కెటింగ్‌పై అవగాహన

సూర్యాపేట, జూలై 17

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు మార్కెటింగ్, బ్రాండింగ్, ఈ–వాణిజ్యం అంశాలపై ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కార్యాలయం (ఎంఎస్ఎంఈ–డీఐ), హైదరాబాద్ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు మార్కెటింగ్ వ్యూహాలు, ఆర్థిక అక్షరాస్యత, ఈ–కామర్స్, వ్యవస్థాపకత అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఉత్పత్తుల బ్రాండింగ్, ప్రచారం, డిజిటల్ మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ ద్వారా వ్యాపారాన్ని విస్తరించుకునే మార్గాలను నిపుణులు వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ–డీఐ హైదరాబాద్ సహాయ సంచాలకులు నవీన్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన నిర్వాహకులు భారతి, వ్యవస్థాపకత అభివృద్ధి కేంద్రం మేనేజర్ నరేష్, సహాయ మేనేజర్లు రాజు, ప్రసాద్, భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయ మేనేజర్ ప్రవీణ్, డొమైన్ నిపుణులు యశ్వంత్, వీరేందర్, భాగ్యరెడ్డి తదితరులు పాల్గొని లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి హామీలు అమలు చేయాలి

హైదరాబాద్, జూలై 17

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు క్రియాశీలకంగా పోరాడిన తొలి, మలి దశ ఉద్యమకారులందరినీ ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నాటి విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం (అమరజ్యోతి) వద్ద శుక్రవారం ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన తెలంగాణ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాటి విద్యార్థి ఉద్యమ నాయకులు అనంతుల మధు, ఏనిగా సంతోష్ రెడ్డి, భాషిపంగు సునీల్, ఎం.డి. గఫార్, పోరెళ్ల విప్లవ్ కుమార్ తదితరులు కేకే కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, మోతె శోభన్ రెడ్డి, రాములు నాయక్‌లను కలిసి ఉద్యమకారుల గుర్తింపు, వారి సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అనంతుల మధు మాట్లాడుతూ, తెలంగాణ కోసం తమ చదువులు, ఉపాధి అవకాశాలు, జీవితాన్ని త్యాగం చేసిన విద్యార్థి ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి ఇచ్చిన హామీలను ఎలాంటి ఆలస్యం లేకుండా అమలు చేయాలని కోరారు. నాటి విద్యార్థి ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 5 గ్రేస్ మార్కులు ఇవ్వాలని, నిరుద్యోగ ఉద్యమకారులకు 98 శాతం సబ్సిడీతో ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.25 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారులు, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్య రంగాల్లో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో 90 శాతం రాయితీ కల్పించాలని, పేద ఉద్యమకారులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉద్యమకారులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రొఫెసర్ కోదండరాంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతుల మధు, ఏనిగా సంతోష్ రెడ్డి, భాషిపంగు సునీల్, ఎం.డి. గఫార్, పోరెళ్ల విప్లవ్ కుమార్ తదితర నాటి విద్యార్థి ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.





# హింసతో భిన్నాభిప్రాయాలను అణచలేరు

**రమణమూర్తిపై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు**

సూర్యాపేట, జూలై 17

హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రచయిత, హిందూ ఆధ్యాత్మికవేత్త విజయ విహారం రమణమూర్తిపై టీవీ లైవ్ డిబేట్ సందర్భంగా జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జైభారత్ బీసీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి వెంకన్న మాట్లాడుతూ, రమణ మూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావ ప్రకటన స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, విమర్శించే హక్కు వంటి రాజ్యాంగబద్ధమైన మౌలిక హక్కులను హింసాత్మక చర్యలతో అణచివేయడం సమంజసం కాదన్నారు. హిందూ మతంలో శాంతి, సహనం, విమర్శను స్వీకరించే సంప్రదాయం ఉందని, భిన్నాభి.ప్రాయాలను చర్చల ద్వారా ఎదుర్కోవాల్సింది పోయి భౌతిక దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మత విశ్వాసాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం, వాటిని ప్రశ్నించే రచయితలు, మేధావులు, సామాజిక విశ్లేషకులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రమణమూర్తి సత్యాన్వేషి, మానవతావాది అని పేర్కొంటూ, ఆయనపై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రమణమూర్తికి తక్షణమే తగిన భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వావిళ్ల రమేష్ గౌడ్ (బీసీ స్టూడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు), నవిల ఉపేందర్ (దళిత హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి), గొడ్డలి నరసన్న, గంగారపు శ్రీను, బొల్లెద్దు వినయ్ (మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు), మహేష్ చారి, దడిపల్లి వెంకట్ (సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా కన్వీనర్), జర్నలిస్ట్ రమణ, ఖదిజ్ఞాసి రేణుక (జైభారత్ సామాజిక విప్లవ రణభేరి జిల్లా ప్రధాన కార్యదర్శి) తదితరులు పాల్గొన్నారు.

# సోనం వాంగ్‌చుక్ ప్రాణాలు కాపాడాలి: ప్రజా సంఘాలు



సూర్యాపేట, జూలై 17

విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయన ప్రాణాలను కాపాడాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ సోనం వాంగ్‌చుక్ 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజా ఉద్యమాలను గౌరవిస్తూ వెంటనే ఆయనతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. దేశంలో ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను ప్రభుత్వాలు అత్యంత తీవ్రంగా పరిగణించాలని, ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి, ప్రవేశ పరీక్షలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించుకునే విధంగా స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య, సీపీఎం నాయకుడు మట్టిపల్లి సైదులు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, రేపాక లింగయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఉమర్, పాల్వాయి భిక్షం, కె. యోగానంద్, బయ్య దేవేందర్, ఫజల్ అబ్ ఖాన్, ఏ. గణిత, కరీం, కోటయ్య, మాధవరెడ్డి, పీఎస్‌యూ నాయకుడు ఆవుల నాగరాజు, చర్లపల్లి వెంకటయ్య, నవీన్, మెంతబోయిన సైదులు, రామకృష్ణ, క్రాంతికుమార్, మన్నూరు నాగన్న తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య

చిలుకూరు గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.

పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్రంరాజు కొండలు (47) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# బీఎల్ఓ విధుల్లో ఆశా వర్కర్లకు పనిభారం

ఆరోగ్య శాఖ టార్గెట్లతో ఇబ్బందులు.. తాత్కాలిక మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి సూర్యాపేట: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలుగా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు రెండు శాఖల పనులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా, అదే సమయంలో ఆరోగ్య శాఖ నుంచి వివిధ కార్యక్రమాలు, సమీక్ష సమావేశాలు, సర్వేలకు హాజరు కావాలని ఆదేశాలు వస్తుండటంతో వారు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. సూర్యాపేట పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ఆరోగ్య శాఖ అధికారులు టార్గెట్లను పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వారు వాపోతున్నారు. "మీ టార్గెట్లు మీరే పూర్తి చేయాలి", "బిల్లులు చేసేది ఎవరు.. ఉద్యోగం చేసేది ఎక్కడ?" అంటూ ప్రశ్నిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఒకవైపు బీఎల్ఓ విధుల్లో ఇంటింటి సర్వేలు, ఓటరు జాబితా సవరణ పనులు నిర్వహించాల్సి ఉండగా, మరోవైపు ఆరోగ్య శాఖ కార్యక్రమాలకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఏ పనికి ప్రాధాన్యం ఇవ్వాలో తెలియక సతమతమవుతున్నామని వారు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఎన్నికల విధుల నిర్వహణపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సంఘం అప్పగించిన బీఎల్ఓ బాధ్యతలు పూర్తయ్యే వరకు ఆశా వర్కర్లకు ఇతర శాఖల విధుల నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వాలని, ఆరోగ్య శాఖ టార్గెట్ల విషయంలో కొంత వెసులుబాటు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఏపీ రాజధానిలో ఆదర్శ వృద్ధాశ్రమం ఏర్పాటు చేయనున్న సీఆర్ ఫౌండేషన్

హైదరాబాద్, జూలై 17

హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) ఫౌండేషన్ తన సేవలను ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతానికి విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ప్రశాంత వాతావరణంలో ఏర్పాటైన కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం వృద్ధులకు గౌరవప్రదమైన జీవనం, మెరుగైన సంరక్షణ అందిస్తున్న దేశంలోని ఉత్తమ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. దివంగత చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాకారం చేస్తూ ఈ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఏర్పాటుకు అప్పటి ముఖ్యమం త్రులు కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎన్టీ రామారావు సహకారం అందించగా, అనంతరం ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్ర బాబు నాయుడు పరిపాలనా, సాంకేతిక సమస్యలను పరిష్కరిం చి సంస్థ స్థాపనకు మార్గం సుగమం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలోనూ ఇదే తరహా లో ఆదర్శ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఫౌండేషన్ భావించింది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఆర్ ఫౌండే షన్ అధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి రాజధాని ప్రాంతంలో వృద్ధాశ్రమం ఏర్పాటుకు భూమి కేటాయిం చాలని విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనపై ముఖ్య మంత్రి సాను కూలంగా స్పందించినట్లు డాక్టర్ నారాయణ తెలిపారు. ప్రతిపా దనను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పురపా లక శాఖ మంత్రి నారాయణకు ముఖ్య మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయ నున్న ఈ ఆదర్శ వృద్ధాశ్రమం ద్వారా చంద్ర రాజేశ్వరరావు సేవా వార సత్వాన్ని కొనసాగిస్తూ వృద్ధులకు నాణ్య మైన సంర క్షణ, గౌర వప్రదమైన జీవనం అందించగలమనే ఆశాభావాన్ని సీఆర్ ఫౌండేషన్ వ్యక్తం చేసింది.

# బడిలో బ్యాలెట్.. ప్రజాస్వామ్య పాఠం!

## ఓటు హక్కు విలువను ఆచరణలో నేర్పిన వినూత్న కార్యక్రమం

చిలుకూరు, జులై 17

చిలుకూరు మండలంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రత్యక్ష అనుభవం ద్వారా పరిచయం చేస్తూ విద్యార్థి నాయకుల ఎన్నికలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశ, రాష్ట్ర ఎన్నికల విధానాన్ని ఆదర్శంగా తీసుకుని స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఎన్నికల కోసం ప్రత్యేక పోలింగ్ బూత్ ఏర్పాటు చేసి, ఓటరు జాబితాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ అధికారులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో పూర్తి ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థులు తమ పేరు, రోల్ నంబర్ ఆధారంగా క్రమశిక్షణతో వరుసలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నాయ కులను తామే ఎన్నుకునే అవకాశం లభించడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటింగ్ అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థి ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ పత్రాలను లెక్కించి ఫలితాలను ప్రకటించారు. ఇందులో 9వ తరగతి విద్యార్థి ఎస్. యోగే శ్వంత్ హెడ్ బాయ్‌గా, 8వ తరగతి విద్యార్థిని సబీహ హెడ్ గర్ల్‌గా, కె. రేవంత్ కుమార్ డిప్యూటీ హెడ్ బాయ్‌గా, కె.నమ్రత డిప్యూటీ హెడ్ గర్ల్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పట్టేటి రాజశేఖర్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు విలువ, నిజాయితీ గల నాయకులను ఎన్నుకునే బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ప్రజా స్వామ్య స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ ఎన్నికలు ఆదర్శప్రాయంగా నిలిచాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.



# పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదించాలి: జాతీయ బీసీ దళ్ డిమాండ్



హైదరాబాద్, జూలై 17

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బీసీ (వెనుకబడిన తరగతులు) బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని, అలాగే ఓబీసీల సంక్షేమం కోసం కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ ఛైర్మన్ దుండ్రా కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కాచిగూడలో ఉన్న జాతీయ బీసీ దళ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఓబీసీల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక సంస్థాగత వ్యవస్థలతో పాటు విశ్వసనీయ సామాజిక-ఆర్థిక గణాంకాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. జాతీయ జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌ను చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో ఖచ్చితమైన గణాంకాల ఆధారంగా విధానాల రూపకల్పన చేయడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలను సమానంగా పంపిణీ చేయడం సాధ్యమవుతుందని అన్నారు. అలాగే కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో విద్య, ఉపాధి, నైపు ణ్యాభివృద్ధి, సంక్షేమం వంటి రంగాల్లో ఓబీసీలకు లక్ష్యబద్ధమైన విధానాలను అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. వివిధ బీసీ, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ జాతీయ సదస్సులో, జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బీసీ బిల్లు, జనాభా లెక్కల్లో ఓబీసీ గణన, ప్రత్యేక ఓబీసీ వ్యవహారాల కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.

# తెలంగాణ చరిత్రను పునర్నిర్మించాలి: చిన్నారెడ్డి

## తుర్రెబాజ్ ఖాన్ త్యాగస్ఫూర్తిని స్మరించిన రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు

హైదరాబాద్, జూలై 17

తెలంగాణ చరిత్రను సమగ్రంగా పునర్నిర్మించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ చారిత్రక, రాజకీయ పరిణామా లను పత్రబద్ధం చేసేందుకు కార్పొరేట్ సంస్థ లు తమ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించి న "స్టార్మింగ్ ది బ్రిటిష్ రెసిడెన్సీ" సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భం గా 1857 జూలై 17న స్వాతం త్ర్య సమర యోధుడు తుర్రెబాజ్ ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్‌తో కలిసి బ్రిటిష్ రెసిడె న్సీపై దాడి చేసిన ఘటనను స్మరించు కున్నారు. 1857 సిపాయిల తిరుగుబాటుకు దక్కన్ ప్రాంతం నుంచి వచ్చిన ప్రతిస్పం దనగా ఆ పోరాటాన్ని ఆయన అభివర్ణిం చారు. తెలంగాణకు చెంది న తొలి స్వాతంత్ర్య సమరయోధుడిగా అండమాన్ సెల్యులార్ జైలులో శిక్ష అనుభవించిన వ్యక్తి మౌల్వీ అల్లావుద్దీన్ అని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా మాజీ టీఎస్‌పీఎస్సీ సభ్యుడు టి. వివేక్, చరిత్రకారిణి డా. కె. పద్మ రచించిన "తెలంగాణ స్టేట్‌హుడ్ మూవ్‌మెంట్ -- ఇయర్స్ ఆఫ్ క్రైసిస్" పుస్తకా న్ని చిన్నారెడ్డి ఆవిష్కరించారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చోటుచేసుకున్న కీలక పరిణా మాలను ఈ గ్రంథం సమగ్రంగా నమోదు చేసిందని, రాష్ట్ర చరిత్రలో ఉన్న లోటును భర్తీ చేస్తుందని ఆయన అన్నారు. భావిత రాలకు తెలంగాణ ఉద్యమ చరిత్రను అందించడంలో ఈ పుస్తకం ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సదస్సులో తెలంగాణ స్టడీస్ డైరెక్టర్ కెప్టెన్ (డా.) ఎల్. పాండురంగారెడ్డి, మహిళా విశ్వవి ద్యాలయ వైస్ చాన్సలర్ సూర్య ధనుం జయ, చరిత్రకారులు డా. కె. పద్మ, డా. పి.అరుణ, ప్రొఫెసర్ అడపా సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీ ఆర్. సురేందర్ రెడ్డిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి నవీన్ అర్చకుడిగా నియామకం

చిలుకూరు, జులై 17



తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని దేవా దాయ, ధర్మాదాయ శాఖ నిర్వహిం చిన అర్చక నియామక పరీక్షల్లో చిలుకూ రు మండలం బేతవోలు గ్రామానికి చెందిన నరగిరి నాధుని నవీన్ ఉత్తీర్ణత సాధించి, మట్టపల్లి శ్రీ లక్ష్మీనర సింహ స్వామి దేవస్థానంలో అర్చకుడిగా నియమి తుల య్యారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదా య శాఖ కమిష నర్ మంత్రి ప్రగడ హనుమంతరావు నవీన్‌కు నియామక పత్రాన్ని అంద జేశారు. బేతవోలు గ్రామానికి చెందిన యువకుడు రాష్ట్రస్థాయి అర్చక పరీక్షల్లో విజయం సాధించి ప్రముఖ దేవాల యంలో అర్చకుడిగా నియమితులు కావడం పట్ల గ్రామస్థులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ నవీన్‌కు అభినందనలు తెలిపారు.

# ఆగస్టు 13లోగా పాఠశాల యూనిఫాంల కుట్టు పనులు పూర్తి చేయాలి: దాన కిశోర్

హైదరాబాద్, జూలై 17

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంల కుట్టు పనులను ఆగస్టు 13లోగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో యూనిఫాంల కుట్టు కార్యక్రమం పురోగతిని సమీక్షించిన ఆయన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్‌డీఓలు), మెప్మా (వీజూహీూ) ప్రాజెక్టు డైరెక్టర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు (డీపీఎంలు), సహాయ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎంలు) తదితర క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడారు. జిల్లాల వారీగా పురోగతిని సమీక్షించిన దాన కిశోర్, గడువులోగా పనులు పూర్తి చేసేందుకు మిషన్ మోడ్‌లో కుట్టు పనులను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన సంఖ్యలో స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్లను, బల్క్ కట్టింగ్ సిబ్బందిని సమీకరించాలని, అవసరమైన చోట బల్క్ కట్టింగ్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మండల కేంద్రాలకు వస్త్రాలు చేరిన వెంటనే పాఠశాలల వారీగా బల్క్ కట్టింగ్ ప్రారంభించి, కుట్టు పనులు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంత మేర మాత్రమే వస్త్రాలు అందిన జిల్లాల్లో మిగిలిన వస్త్ర సరఫరా వేగవంతం చేయడానికి డీఆర్‌డీఓలు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు ప్రాంతీయ సమన్వయ అధికారులు (ఆర్‌సీఓలు), జిల్లా సమన్వయ అధికారులు (డీసీఓలు)తో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. యూనిఫాంల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్న ఆయన, ప్రతి యూనిఫాం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. మన్నికగా ఉండేలా, కుట్టు పనుల్లో లోపాలు లేకుండా తయారు చేసి, నిర్ణీత గడువులోగా విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు.

# వేసవి ఇంటర్న్‌లకు సైబరాబాద్ పోలీసులు సన్మానం

హైదరాబాద్, జూలై 17

సైబరాబాద్ పోలీసులు నిర్వహించిన సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఫెలిసిటేషన్ ప్రోగ్రామ్--2026లో 50 మందికి పైగా విద్యార్థులను సన్మానించారు. "ప్రజా సేవలో ఆవిష్కరణ, అభ్యాసం, సహకారాన్ని వేడుకగా జరుపుకుందాం" అనే అంశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. ఎల్లప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తిని కొనసాగించాలని, నిజాయితీ, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యాలను అలవరచుకోవాలని సూచించారు. తన పోలీసు సేవా అనుభవాలను పంచుకుంటూ, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, జట్టుగా పనిచేయడం, సమాజానికి సానుకూలంగా సేవలందించడం అవసరమని చెప్పారు. ఇంటర్న్‌లతో ముఖాముఖి మాట్లాడిన కమిషనర్, వారి ఇంటర్న్‌షిప్ అనుభవాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. అర్థవంతమైన సంభాషణ, ఆత్మవిశ్వాసం, ప్రజాకేంద్రిత పోలీసింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రజల అంచనాలను అర్థం చేసుకోవడంతో పాటు, ఇతరుల గుర్తింపు కోసం ఎదురుచూడక ముందే తాము చేసిన పనిని తాము గౌరవించుకోవాలని సూచించారు. ఇంటర్న్‌లు ఇంటర్న్‌షిప్ సందర్భంగా రూపొందించిన సాంకేతిక ఆధారిత వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో వారి సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, సమస్యల పరిష్కార సామర్థ్యం ప్రతిఫలించాయి. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని డీసీపీ (అడ్మిన్) డాక్టర్ టి. అన్నపూర్ణ, ఏసీపీ గంగారాం పర్యవేక్షణలో నిర్వహించగా, సైబర్ సెక్యూరిటీ కన్సల్టెంట్లు భాను మూర్తి, మాగులూరి అమూల్య, కుసుమ సాయి అభినంద్ మార్గదర్శకత్వం అందించారు.




## సోనమ్ వాంగ్చుక్ దీక్షకు టీఆర్పీ మద్దతు.. ప్రాణాలకు హాని జరిగితే కేంద్ర ప్రభుత్వమే బాధ్యత: మొరుగు వీరేష్

**మనదీపం, జూలై 17 :**

పర్యావరణ సామాజిక శాస్త్రవేత్త సోనమ్ వాంగ్చుక్ ప్రాణాలకు ఏవైనా హాని జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు మొరుగు వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐజ పట్టణంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో సోనమ్ వాంగ్చుక్ ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జరిగిన నీట్ (చీజుజు) పరీక్షల అవకతవకలు, పేపర్ లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం పారదర్శకమైన, శాస్త్రీయమైన పరీక్షా విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

**నీట్ పరీక్షలలో జరిగిన అవక తవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లిలి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో విశ్వసనీయత కోల్పోయిన లిలినేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీటూ)లిలిను రద్దు చేసి సమర్థ వంతమైన ప్రత్యామ్నాయ పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష 19 రోజులు దాటిందని, ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారిందని మొరుగు వీరేష్ తెలిపారు.**

బీపీ, షుగర్ స్థాయిలు పడిపోవడంతో ఆయన ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ కొనసాగుతున్న నిరసన దీక్షలు 25 రోజులు దాటినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను రాజకీయాలకు అతీతంగా పరిగణించి పాలక, ప్రతిపక్ష పార్టీలు కలిసి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలిలి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా సోనమ్ వాంగ్చుక్ దీక్షకు మద్దతుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఐజ పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పోస్టర్లతో నిరసన వ్యక్తం చేస్తూ సోనమ్ వాంగ్చుక్‌కు సంఘీభావం ప్రకటించారు. దేశంలోని విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి యువత, విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలు, ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని మొరుగు వీరేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార

## హనుమాన్ కథలో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, జూలై 17**

షంషాబాద్‌లోని ప్రెస్టీజ్ సిటీ సమీపంలోని పురాన్ సన్స్ ఫామ్‌లో బాగేశ్వర్ ధామ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "హనుమాన్ కథ ఒ దివ్య దర్బార్" కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాగేశ్వర్ సర్కార్‌గా ప్రసిద్ధి చెందిన పూజ్య ధీరేంద్ర కృష్ణ శాస్త్రి మహారాజ్‌కు గవర్నర్ శ్రద్ధాంజలి ఘటించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, భగవాన్ హనుమంతుడి భక్తి, నిస్వార్థ సేవ, ధైర్యం, వినయం, క్రమశిక్షణ వంటి ఆదర్శాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నైతిక విలువలను బలోపేతం చేయడంతో పాటు సామాజిక సామరస్యాన్ని పెంపొందించి భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తాయని పేర్కొన్నారు. ధీరేంద్ర కృష్ణ శాస్త్రి తన ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా సనాతన ధర్మం, దేశభక్తి, సేవా భావాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నందుకు గవర్నర్ అభినందించారు. శ్రీరాముడు, శ్రీ బాగేశ్వర్ బాలాజీ ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆధ్యాత్మిక శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు.

## జూలై 19న లాల్‌దర్వాజాలో జగన్నాథ రథయాత్ర

**హైదరాబాద్, జూలై 17**

పాతబస్తీలోని లాల్‌దర్వాజా కేంద్రంగా శ్రీ శ్రీ రాధే కృష్ణ ఆత్మ రమణ్ మందిరం ఆధ్వర్యంలో వార్షిక జగన్నాథ రథయాత్రను జూలై 19న నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం, రథయాత్ర పాత షా అలీ బండ పోలీస్ స్టేషన్ సమీపంలోని లాల్‌దర్వాజా నుంచి ప్రారంభమై బాలాగంజ్, గౌలిపురా మార్కెట్, సుధా టాకీస్, లాల్‌దర్వాజా చౌరస్తా మీదుగా ప్రయాణించి తిరిగి శ్రీ శ్రీ రాధే కృష్ణ ఆత్మ రమణ్ మందిరంలో ముగుస్తుంది. ఈ ఆధ్యాత్మిక రథయాత్రలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు

# సోనం వాంగ్చుక్ దీక్షకు టీఆర్పీ సంపూర్ణ మద్దతు








**రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ ర్యాలీలు.. 'చలో సంసద్' విజయవంతం చేయాలని పిలుపు**

**హైదరాబాద్, జూలై 17**

నీట్ (చీజుజు) పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీటూ) ను రద్దు చేసి దాని స్థానంలో పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లతో లద్దాఖ్ హక్కుల ఉద్యమ నాయకుడు, పర్యావరణవేత్త సోనం వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు తెలంగాణ రాజ్యాధికార పార్టీసంపూర్ణ మద్దతు ప్రకటించింది. గత 20 రోజులుగా ఆయన దీక్ష కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ ఇచ్చిన చలో సంసద్' పిలుపునకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తి మద్దతు ప్రకటించినట్లు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. సోనం వాంగ్చుక్ పోరాటానికి సంఘీభావంగా, 'చలో సంసద్' కార్యక్రమానికి మద్దతుగా యాదాద్రి భువనగిరి, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొల్పడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్న పార్టీ నాయకులు, ఈ ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా భావించి విద్యార్థులు, యువత, మేధావులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున సోనం వాంగ్చుక్ దీక్షకు మద్దతు తెలపాలని, జూలై 20న నిర్వహించే చలో సంసద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలి: బేరి రామచందర్ యాదవ్

**పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు బీసీ సంఘాల నేతల వినతిపత్రం**

**హైదరాబాద్, జూలై 17**

తెలంగాణ రాష్ట్ర యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన బోర్డు సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ, బీసీ వర్గానికి చెందిన ఈశ్వరమ్మ యాదవ్‌కు దేవస్థాన బోర్డు సభ్యురాలిగా అవకాశం రావడాన్ని జీర్ణించుకోలేక కొందరు అగ్రవర్ణ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈశ్వరమ్మ యా దవ్‌పై చేసిన వ్యాఖ్యలు యాదవ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని



పేర్కొంటూ, శివచరణ్ రెడ్డిని వెంటనే పార్టీ నుంచి బహిష్కరించి, బహిరంగ గంగా క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లను పట్టించు కోకపోతే రాష్ట్రవ్యా ప్తంగా యాదవులు, బీసీ సంఘా లు ఆందోళనలను ఉధృతం చేస్తాయని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర బీసీ కుల సంఘాల ఐక్యవేదిక, బీసీ ఫెడరేషన్, మేదరి మహేంద్ర సంఘం ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు, యాదవ సంఘాల ప్రతినిధు లు, సామాజిక కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సంగారెడ్డి కాంగ్రెస్‌కు భారీ షాక్.. టీఆర్పీలోకి నీరడు ఆంజనేయులు, 30 మంది అనుచరులు

**హైదరాబాద్, జూలై 16**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి అనుచరుడిగా, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నీరడు ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సుమారు 30 మంది అనుచరులతో కలిసి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మన్నే రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నీరడు ఆంజనేయులు మాట్లాడుతూ, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు రాజకీయ అధికారం సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న తీన్మార్ మల్లన్న నాయకత్వాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో టీఆర్పీలో చేరినట్లు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. అగ్రవర్ణాల ఆధిపత్య పార్టీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు తగిన రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని, వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నందున ఆ పార్టీలను వీడి టీఆర్పీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతా లకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాధి కార సాధనే పార్టీ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, ముత్యాలు, చంద్రక్, సుధాకర్, ఎండి ఆజీ, నరేష్, శాంతికుమార్, ఎండి సమీర్, గణేష్, ఎండి సాయిదా, తస్లీమ్ బేగం, ఎండి షమీంల, ఎండి షకీలా, దుర్గేష్, ఎం. మురళి తదితరులు టీఆర్పీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమంగా మారిన స్టీల్ బ్యాంక్

**హుస్నాబాద్, జూలై 17**

పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యంతో ప్రారంభించిన "స్టీల్ బ్యాంక్" కార్యక్రమం ఏడాది పూర్తి చేసుకుని ప్రజా ఉద్యమంగా మారిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2025 జూలై 17న పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంత్రి స్వంత నిధులతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు 276 స్టీల్ బ్యాంక్ సెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. దీంతో 7,376 స్వయం సహాయక సంఘాలకు చెందిన 80,633 మంది మహిళలు లబ్ధి పొందగా, ఈ కార్యక్రమం కోసం ఇప్పటివరకు రూ.2.54 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు తెలిపారు. వివాహాలు, సామూహిక విందులు, గ్రామీణ వేడుకల్లో స్టీల్ పాత్రల వినియోగం పెరగడంతో ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా తగ్గిందని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్లాస్టిక్ కప్పులకు ప్రత్యామ్నాయంగా 319 హోటళ్లకు 33,900 స్టీల్ గ్లాసులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సమాజంలో శాశ్వత మార్పు తీసుకొచ్చే ఆలోచనలే నిజమైన అభివృద్ధికి నాంది పలుకుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల భాగస్వా మ్యంతో ప్లాస్టిక్ రహిత హుస్నాబాద్ లక్ష్యాన్ని సాధించి, భావిత రాలకు పరిశుభ్రమైన, పచ్చదనం తో కూడిన ఆరోగ్యకరమైన నియోజకవర్గాన్ని అందించేం దుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. స్టీల్ బ్యాంక్‌తో పాటు విస్తృత స్థాయిలో మొక్కల నాటకం, చెరువుల పునరుద్ధరణ, బహిరంగ ప్రదేశాల సుందరీకరణ వంటి కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని తెలిపారు. ప్లాస్టిక్ రహిత గ్రామాల నుంచి ప్లాస్టిక్ రహిత హోటళ్ల వరకు విస్తరించిన ఈ స్టీల్ బ్యాంక్ ఉద్యమం, భవిష్యత్తులో ప్లాస్టిక్ రహిత తెలంగాణ సాధనకు ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## చలో సంసద్'కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీఆర్పీ మద్దతు

**అశ్వారావుపేట, జూలై 17**

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జూలై 20న నిర్వహించనున్న చలో సంసద్ కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు మల్లెల వీరనారాయణ ఆదేశాల మేరకు అశ్వారావుపేట మండల అధ్యక్షుడు పి. ప్రసాద్ శుక్రవారం నిర్వహించిన మద్దతు కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం నిర్వహిస్తున్న చలో సంసద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోర్ర ప్రశాంత్ గౌడ్ నాయకులు వంశీ గౌడ్ , స్వామి మధు తదితరులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో సామా జిక న్యాయం కోసం జరుగుతున్న ఉద్యమాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచిసంపూర్ణసహకారం అందిస్తామని నాయకులు తెలిపారు.



## సర్ పాస్ ట్రెక్ పూర్తి చేసిన తొమ్మిదేళ్ల బాలికకు గవర్నర్ అభినందనలు

**హైదరాబాద్, జూలై 17**

హిమాచల్ ప్రదేశ్‌లోని సర్ పాస్ ట్రెక్‌ను విజయవంతంగా పూర్తి చేసిన హైదరాబాద్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలిక వి. సిరి అతాషాను గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా శుక్రవారం లోక్ భవన్‌లో సత్కరించారు. సిరి అతాషా సముద్ర మట్టానికి 13,800 అడుగుల ఎత్తులో ఉన్న సర్ పాస్ ట్రెక్‌ను పూర్తి చేసి చిన్న వయసులోనే అసాధారణ ధైర్యసాహసాలు, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది. ఈ సంద ర్భంగా గవర్నర్‌తో మాట్లాడిన సిరి అతాషా, ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న మోటారు వాహన మార్గంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు పొందిన లడఖ్‌లోని ఉమ్లింగ్ లా పాస్‌ను సందర్శించిన అనుభవాలను కూడా వివరించింది. ఈ సందర్భంగా గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా బాలికను అభినందిస్తూ, ఆమె సాహసోపేతమైన తత్వా న్ని, పట్టుదలను ప్రశంసించారు. సిరి అతాషా వంటి చిన్నారుల విజ యాలు భారత యువతలో అపారమైన ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని చాటుతున్నాయని, ఇతర యువతకు కూడా తమ కలలను ఆత్మవిశ్వాసంతో సాధించేలా ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని సిరి అతాషాకు ఆకాంక్షించిన గవర్నర్, ఆమె విజయం మరింత మంది చిన్నారులు సాహస క్రీడలు, క్రమశిక్షణ, అన్వేషణాత్మక దృక్పథం వైపు అడుగులు వేయడానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# గంభీర్, కోహ్లీ మధ్య విభేదాల్లేవు

**కార్డిఫ్, జులై 17**

భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మధ్య విభేదాలు నెలకొన్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ ఖండించారు. వారిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, జట్టు ప్రయోజనాల కోసం ప్రతిరోజూ అనేకసార్లు పరస్పరం చర్చించుకుంటూ ఉంటారని స్పష్టం చేశారు. ఇంగ్లండ్‌తో కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డే అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్, గంభీర్, కోహ్లీ మధ్య సంబంధాలు ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నాయని తెలిపారు. గురువారం ఒక్కరోజే వారిద్దరూ దాదాపు పది సార్లు మాట్లాడుకున్నారని పేర్కొన్నారు. జట్టులోని వ్యూహాలు, మ్యాచ్ పరిస్థితులు, బ్యాటింగ్‌కు సంబంధించిన అంశాలపై తరచూ చర్చలు జరుపుతుంటారని వెల్లడించారు. కొద్ది రోజుల క్రితం బర్మింగ్‌హామ్‌లో జరిగిన భారత జట్టు సాధన సందర్భంగా గంభీర్, కోహ్లీ ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విభేదాలపై ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ ప్రచారానికి ఎలాంటి ఆధారాలు లేవని కోటక్ స్పష్టం చేశారు. కొద్దిసేపు మాట్లాడకపోవడాన్ని విభేదాలుగా చిత్రీకరించడం సరైనది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

విరాట్ కోహ్లీ భవిష్యత్‌పై కూడా కోటక్ స్పందించారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే కోహ్లీ కోరిక ఇప్పటికీ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే ఎన్నో ఘనతలు సాధించిన కోహ్లీకి నిరూపించుకోవాల్సింది ఏమీ లేకపోయినా, జట్టుకు ఉపయోగపడినంతకాలం భారత జట్టుకు సేవలందించాలనే తపనతో ఉన్నాడని చెప్పారు. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో ఆదివారం జరిగే మూడో, చివరి వన్డేతో ఈ సిరీస్ ముగియనుంది. అనంతరం సెప్టెంబర్‌లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కూడా విరాట్ కోహ్లీ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జట్టు వర్గాలు వెల్లడించాయి.



# భారత జట్టులోకి హర్షిత్ రాణా
# పునరాగమనం

**భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని భారత బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ ఖండించారు. లార్డ్స్ వన్డే అనంతరం రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతారనే వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. రోహిత్‌పై ఎలాంటి ఒత్తిడి లేదని, జట్టు యాజమాన్యం ఆయనపై పూర్తి విశ్వాసంతో ఉందని తెలిపారు.**

**లండన్, జులై 17**

ప్రస్తుత వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో రోహిత్ ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోయినప్పటికీ, అది కేవలం ఆటలో భాగమేనని కోటక్ పేర్కొన్నారు. గొప్ప ఆటగాళ్లు ఇలాంటి పరిస్థితులను అధిగమించే సామర్థ్యం కలిగి ఉంటారని, లార్డ్స్ వేదికగా జరిగే తదుపరి మ్యాచ్‌లో రోహిత్ తనదైన శైలిలో రాణిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జట్టు ప్రధాన లక్ష్యం సిరీస్‌ను కైవసం చేసుకోవడమే తప్ప, రిటైర్మెంట్ ఊహాగానాలకు ప్రాధాన్యం లేదన్నారు. కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో బ్యాటర్ల ఇబ్బందులకు పిచ్ స్వభావమే కారణమని కోటక్ వివరించారు. బంతి వేగంలో వచ్చిన హెచ్చుతగ్గుల వల్ల రోహిత్ సహజసిద్ధమైన షాట్లు ఆడలేకపోయారని చెప్పారు. ఇది ఫామ్ సమస్య కాదని, పరిస్థితులకు అనుగుణంగా వచ్చిన ఇబ్బందేనని స్పష్టం చేశారు. విరాట్ కోహ్లీ పిచ్ ప్రవర్తనపై డ్రెస్సింగ్ రూమ్‌కు ఇచ్చిన సూచనలు జట్టుకు ఉపయోగపడ్డాయని వెల్లడించారు. భారత్ 233 పరుగులు చేసినప్పటికీ, ఇంగ్లండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో విజయం సాధించలేకపోయిందన్నారు. మరో 40 నుంచి 50 పరుగులు అదనంగా చేసి ఉంటే ఫలితం భిన్నంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. విరాట్ కోహ్లీ, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య విభేదాలున్నాయన్న ప్రచారాన్ని కూడా కోటక్ ఖండించారు. వారిద్దరి మధ్య మంచి అవగాహన ఉందని, జట్టు ప్రయోజనాల కోసం నిరంతరం చర్చలు జరుపుతుంటారని చెప్పారు. కోహ్లీ సాధన సమయంలో కోచ్‌లతో సాంకేతిక అంశాలపై చర్చించడం సహజమని, దానిని తప్పుగా అర్థం చేసుకోవద్దని సూచించారు. వాషింగ్టన్ సుందర్ గాయం జట్టుకు ఎదురుదెబ్బేనని పేర్కొన్న కోటక్, అయినప్పటికీ లార్డ్స్ వన్డేలో విజయమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగుతుందని తెలిపారు.

# దక్షిణ కొరియాపై
# మెక్సికో విజయం..

**ఫిఫా ప్రపంచకప్ విజేతలకు తొలిసారి 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'**

దేశీయ ఐటీ దిగ్గజం విప్రో లిమిటెడ్ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) ఫలితాలను ప్రకటించింది. ఈ కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 3,352 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ. 3,330.4 కోట్లతో పోలిస్తే స్వల్ప వృద్ధి నమోదైంది.

ఫుట్‌బాల్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫిఫా ప్రపంచకప్--2026లో విజేతగా నిలిచే జట్టుకు ఈసారి సరికొత్త గౌరవం దక్కనుంది. ప్రపంచకప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీ, బంగారు పతకాలతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన 'ఛాంపియన్‌షిప్ రింగ్స్'ను కూడా అందజేయనున్నట్లు ఫిఫా ప్రకటించింది. అమెరికన్ క్రీడల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ సంప్రదాయాన్ని అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో తొలిసారిగా అమలు చేయనున్నారు. ఫైనల్ మ్యాచ్ ముగిసిన వెంటనే ఈ ప్రత్యేక ఉంగరాల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలుత విజేత జట్టు కెప్టెన్, ప్రధాన కోచ్‌కు ప్రత్యేక రింగ్స్ అందజేస్తారు. అనంతరం జట్టు సభ్యుల కోసం రూపొందించిన మొత్తం 30 ఒరిజినల్ రింగ్స్‌ను అధికారికంగా బహూకరిస్తారు. ప్రతి రింగ్‌పై ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీ ప్రతిరూపంతో పాటు విజేత జట్టుకు సంబంధించిన ప్రత్యేక డిజైన్ ఉంటుంది. ప్రతి ఉంగరానికి ప్రత్యేక సీరియల్ నంబర్‌తో పాటు అసలైనదని ధ్రువీకరించే ప్రమాణపత్రం కూడా అందజేయనున్నారు. ఈ అరుదైన జ్ఞాపకాన్ని అభిమానులకు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 2,026 ఛాంపియన్‌షిప్ రింగ్స్‌ను తయారు చేయాలని ఫిఫా నిర్ణయించింది. అందులో 30 రింగ్స్ విజేత జట్టుకు కేటాయించగా, మిగిలిన 1,996 రింగ్స్‌ను అధికారిక లైసెన్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానులకు విక్రయించనున్నారు.

దీంతో ప్రపంచకప్ చరిత్రలో భాగమైన ప్రత్యేక జ్ఞాపకాన్ని అభిమానులు సొంతం చేసుకునే అవకాశం లభించనుంది. ఇదిలా ఉండగా, 2026 ఫిఫా ప్రపంచకప్ తుది సమరానికి రంగం సిద్ధమైంది. ఫైనల్లో యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా జట్లు తలపడనున్నాయి. సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం సాధించిన స్పెయిన్ ఫైనల్‌కు చేరుకోగా, అర్జెంటీనా వరుసగా రెండోసారి ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించి మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. ఈ తుది పోరుపై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.





# సెన్సెక్స్‌కు ఐటీ ఊపు.. 964 పాయింట్లు జంప్

**ప్రధాన సూచీలు బలంగా రాణించినప్పటికీ, విస్తృత మార్కెట్ మాత్రం వెనుకబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 సూచీ 0.73 శాతం, స్మాల్‌క్యాప్-100 సూచీ 0.83 శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. లార్జ్‌క్యాప్ షేర్లలోనే కొనుగోళ్లు కేంద్రీకృతం కావడం ఇందుకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.**

గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు వచ్చినప్పటికీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం బలమైన ర్యాలీతో ముగిశాయి. ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆటో రంగాల షేర్లలో భారీ కొనుగోళ్లు నమోదవడంతో సెన్సెక్స్ 964.59 పాయింట్లు ఎగబాకి 78,151.45 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 261.55 పాయింట్లు లాభపడి 24,334.30 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచే కొనుగోళ్ల జోరు కొనసాగడంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 78,282.55 గరిష్ఠ స్థాయిని తాకగా, నిఫ్టీ 24,367.30 వరకు చేరుకుంది. జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కావడం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచింది. అంచనాలకు మించిన లాభాలను ప్రకటించిన టెక్ మహీంద్రా షేరు దూసుకెళ్లగా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ ఐటీ సంస్థల షేర్లు కూడా భారీగా లాభపడ్డాయి. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలోని ప్రధాన షేర్లు, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి హెవీవెయిట్ స్టాక్స్ కూడా మార్కెట్‌కు మద్దతు ఇచ్చాయి.

అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వ్యాఖ్యలతో ఆసియా మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, దేశీయ పెట్టుబడిదారులు కొనుగోళ్లను కొనసాగించడంతో భారత మార్కెట్ ఆ ప్రభావాన్ని సమర్థంగా తట్టుకుంది. విదేశీ ప్రతికూలతల మధ్య కూడా దేశీయ ఆర్థిక వ్యవస్థపై ఉన్న విశ్వాసం మార్కెట్‌కు ఊతమిచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రధాన సూచీలు బలంగా రాణించినప్పటికీ, విస్తృత మార్కెట్ మాత్రం వెనుకబడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 సూచీ 0.73 శాతం, స్మాల్‌క్యాప్-100 సూచీ 0.83 శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. లార్జ్‌క్యాప్ షేర్లలోనే కొనుగోళ్లు కేంద్రీకృతం కావడం ఇందుకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

వారాంతపు ట్రేడింగ్‌లో నిఫ్టీ 24,100 స్థాయి వద్ద బలమైన మద్దతు పొందడం సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. వచ్చే వారం వెలువడనున్న ప్రధాన కంపెనీల త్రైమాసిక ఫలితాలు, ఆర్థిక అంచనాలు మార్కెట్ తదుపరి దిశను నిర్ణయించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆహార భద్రతపై కాజల్ అవగాహన ప్రచారం




**టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన తాజా చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రచారంలో భాగంగా ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురుగుమందుల అధిక వినియోగం, ఆహార కల్తీ, వాటి వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని ఈ చిత్రం ప్రధాన అంశంగా తీసుకురావడంతో, అదే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.**

ఈ నేపథ్యంలో కాజల్ సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని ప్రారంభించారు. తన భోజనానికి సంబంధించిన చిత్రాన్ని పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ తాము తీసుకునే ఆహారం నాణ్యతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో పాల్గొనాలని హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలకు కూడా సవాల్ విసిరారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ తల్పడే కూడా ఈ ప్రచారానికి మద్దతు తెలిపారు. బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాల్సిన అవసరం ఉందని, మనం తినే ఆహారం వెనుక ఉన్న వాస్తవాలపై చర్చ జరగాలని ఆయన పేర్కొన్నారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన 'ది ఇండియన్ స్టోరీ' చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పణలో సాగర్ బి. షిండే నిర్మించిన ఈ చిత్రం జులై 24న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం కాజల్ ప్రారంభించిన ఈ అవగాహన ప్రచారానికి సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోంది.

# బన్నీ నయా లైనప్.. 'పుష్ప 3' ఆలస్యమయ్యే అవకాశం?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో అత్యంత బిజీ కథానాయకులలో ఒకరిగా కొనసాగుతున్నారు. 'పుష్ప' చిత్రాలతో దేశవ్యాప్తంగా అపారమైన క్రేజ్ సంపాదించుకున్న బన్నీ, ఇప్పుడు వరుసగా భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అయితే ఆయన కొత్త లైనప్ చూసిన అభిమానుల్లో ఒకవైపు ఉత్సాహం కనిపిస్తుండగా, మరోవైపు 'పుష్ప 3' భవితవ్యంపై ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ తమిళ స్టార్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ మూవీ 'రాకా' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. భారీ వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా ఈ సినిమా విడుదల 2027 చివర్లో లేదా 2028కి వెళ్లే అవకాశాలు ఉన్నాయని చిత్ర పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

'రాకా' తర్వాత బన్నీ మరో తమిళ స్టార్ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో సినిమా చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ కూడా భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగానే, మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్‌తో కూడా అల్లు అర్జున్ సినిమా దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఇటీవల బసిల్ సోషల్ మీడియాలో 'ఐకాన్' అని రాసి ఉన్న టోపీ (క్యాప్) ఫొటోను పంచుకోవడం ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్‌తో సినిమా గురించి అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా, ఇద్దరి మధ్య చర్చలు పూర్తయ్యాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

# 'టాక్సిక్'లో ఛాన్స్ మిస్ చేసుకున్న స్టార్ హీరోయిన్!



'కేజీఎఫ్ 2' తర్వాత రాకింగ్ స్టార్ యశ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్‌లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచగా, ఇందులో యాక్షన్‌తో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల అనుబంధం కథలో కీలకంగా ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో నటించే అవకాశం తొలుత బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్‌కు వచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే వ్యక్తిగత కారణాలతో ఆమె ఈ ప్రాజెక్ట్‌కు దూరమైనట్లు సమాచారం. అనంతరం ఆమె స్థానంలో నయనతారను ఎంపిక చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.



# సమంతకు కుటుంబ సభ్యుల సర్‌ప్రైజ్ వేడుక?

**టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఆమె దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ కుటుంబ వివాహ వేడుకకు హాజరైనట్లు, ఆ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి ఆమెకు ప్రత్యేక సర్‌ప్రైజ్ వేడుక ఏర్పాటు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.**

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాల ప్రకారం, ఆ వివాహ వేడుకలో సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపిస్తూ ఆశీర్వదించినట్లు తెలుస్తోంది. ఈ వేడుకను ముందుగా ఊహించని సమంత భావోద్వేగానికి గురై కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపినట్లు ప్రచారం సాగుతోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక సందర్భంలో పాల్గొన్నట్లు సమాచారం. వేడుకకు సంబంధించినట్లు ప్రచారంలోకి వచ్చిన చిత్రాల్లో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. అభిమానులు కూడా ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సందేశాలు పోస్టు చేస్తున్నారు.

అయితే, సమంత వ్యక్తిగత జీవితానికి సంబంధించి ప్రచారంలో ఉన్న గర్భధారణ వార్తలపై ఆమె గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అందువల్ల సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఈ వార్తలకు అధికారిక ధృవీకరణ లేదు. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్ర విజయంతో సమంత మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టుల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్న ఆమె కొంతకాలం విరామం తీసుకుంటున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# క్రిస్మస్‌కు బాలయ్య

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఎన్‌బీకే111'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ముఖ్యంగా బాలకృష్ణ స్టైలిష్ మాస్ లుక్ అభిమానులను ఆకట్టుకోవడంతో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఈ చిత్రంలో బాలకృష్ణను గతంలో ఎన్నడూ చూడని కొత్త స్టైలిష్ అవతారంలో దర్శకుడు గోపీచంద్ మలినేని చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. మాస్ ఎలివేషన్లతో పాటు స్టైలిష్ యాక్షన్, భారీ నిర్మాణ విలువలకు ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ సినిమా విడుదల తేదీపై ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా 'ఎన్‌బీకే111'ను విడుదల చేయాలని చిత్రబృందం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. తొలుత ఈ చిత్రాన్ని డిసెంబర్ తొలి వారంలో విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, అదే సమయంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రభాస్ చిత్రంతో నేరుగా పోటీ పడకుండా క్రిస్మస్ సెలవులు, నూతన సంవత్సరం సెలవులను లక్ష్యంగా చేసుకుని డిసెంబర్ చివరి వారంలో సినిమాను విడుదల చేస్తే బాక్సాఫీస్ వద్ద మరింత ప్రయోజనం ఉంటుందని నిర్మాతలు భావిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. సెలవుల సీజన్ కారణంగా సినిమాకు మంచి ఓపెనింగ్స్‌తో పాటు దీర్ఘకాల ప్రదర్శన లభించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలకృష్ణ మరోసారి తన మాస్ ఇమేజ్‌కు తగ్గ పాత్రలో కనిపించనున్నారు. గోపీచంద్ మలినేని శైలిలో హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు, భారీ ఎలివేషన్లు, కమర్షియల్ అంశాలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467